**13 Sept., 2026 – 24th Sunday in Ord. Time (A Cycle)**

*Sir 27:30–28:7; Rom 14:7–9; Mt 18:21–35*

*“How God forgives us, so we must forgive one another.”*

**2026 సెప్టెంబరు 13 – సాధారణ కాలంలోని 24వ ఆదివారం (అ సంవత్సరం)**

**సిరాక్ 27:30–28:7; రోమీయులకు 14:7–9; మత్తయి 18:21–35**

**ప్రధాన సందేశం: “దేవుడు మనలను క్షమించినట్లే, మనమూ ఒకరినొకరు క్షమించాలి.”**

## ప్రవేశిక

ఒక ఉపాధ్యాయురాలు తన విద్యార్థులకు ఒక విచిత్రమైన పని చెప్పింది. వారు క్షమించడానికి నిరాకరించే ప్రతి వ్యక్తి కోసం ఒక బంగాళాదుంపను ఒక సంచిలో వేసుకొని ఎప్పుడూ తమతో తీసుకెళ్లాలని చెప్పింది. కొన్ని రోజుల తరువాత ఆ బంగాళాదుంపలు కుళ్లిపోవడం ప్రారంభించాయి. దుర్వాసన భరించలేనంతగా మారింది. పిల్లలు ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. అప్పుడు ఆ ఉపాధ్యాయురాలు ప్రశాంతంగా ఇలా చెప్పింది: “క్షమించలేని మనసు మన హృదయానికి చేసేది ఇదే.”

ఈరోజు సువార్తలో పేతురు, తాను ఎన్ని సార్లు క్షమించాలో యేసును అడుగుతాడు. యేసు ఒక సంఖ్యతో సమాధానం చెప్పడు. జీవించే ఒక విధానాన్ని చూపిస్తాడు: “డెబ్బై ఏడు సార్లు.” దేవుడు మనపై చూపే కరుణకు హద్దుల్లేవు. అదే కరుణ మన ద్వారా ఇతరులకు కూడా ప్రవహించాలని యేసు మనలను ఆహ్వానిస్తున్నాడు.

మన జీవితంలోని విషాదం ఏమిటంటే, ఎన్నో సంవత్సరాల పాటు పాత గాయాలను, బాధలను మన హృదయంలో మోస్తూ ఉండటం. పగ, గర్వం, చేదు భావాలతో మనమే మనలను బంధించుకుంటాం. అయితే ఈరోజు సువార్త మనకు గుర్తుచేస్తోంది: క్షమించడం బలహీనత కాదు; అది నిజమైన స్వేచ్ఛ.

దేవుడు మన అప్పును కేవలం వాయిదా వేయలేదు; క్రీస్తు ద్వారా దానిని పూర్తిగా రద్దు చేశాడు.

ఈ పవిత్ర బలిపీఠం చుట్టూ మనమందరం కూడి ఉన్న ఈ వేళ, మన హృదయాలను కోపం, పగ, కఠినత్వం నుండి విముక్తం చేయమని ప్రభువును ప్రార్థిద్దాం. నిజమైన పశ్చాత్తాపంతో ఈ పవిత్ర రహస్యాలను జరుపుకోవడానికి ఆయన మనలను సిద్ధపరచుగాక.

## ప్రసంగం

ఒక చిన్న బాలుడు తన కుటుంబంలో జరిగిన ఒక గొడవ తర్వాత తన అమ్మమ్మకు ఒక ఉత్తరం వ్రాశాడు. అందులో ఇలా వ్రాశాడు:

"అమ్మమ్మా, మీరు, నాన్న ఒకరిపై ఒకరు కోపంగా ఉన్నారని నాకు తెలుసు. కానీ క్రిస్మస్ పండుగ దగ్గరపడుతోంది. నేను ఏ ఇంటికి వెళ్లాలో నన్ను ఎంచుకోమని మాత్రం చెప్పకండి."

ఆ ఉత్తరాన్ని చదివిన అమ్మమ్మ కన్నీళ్లు పెట్టుకుంది. ఇద్దరు పెద్దవాళ్లు ప్రేమకన్నా గర్వానికీ, పగకీ ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని ఆమె గ్రహించింది. ఆ చిన్న బాలుడే చివరకు ఆ కుటుంబాన్ని మళ్లీ ఒక్కటిగా చేసిన వారధిగా మారాడు.

ఈరోజు సువార్తలో యేసు మాట్లాడుతున్న ప్రపంచం కూడా ఇలాంటిదే. కోపం, గాయాలు, గర్వం, పగ, విరిగిపోయిన బంధాలతో బాధపడుతున్న ప్రపంచం.

పేతురు యేసువద్దకు వచ్చి, తాను చాలా ఉదారంగా అడుగుతున్నానని భావించి ఇలా అంటాడు:

"ప్రభూ! నా సహోదరుడు నాకు అపకారం చేస్తే నేను అతనిని ఎన్నిసార్లు క్షమించాలి? ఏడు సార్ల వరకునా?"

యూదుల సంప్రదాయంలో ఏడు అనే సంఖ్య పరిపూర్ణతకు చిహ్నం. కాబట్టి పేతురు తన వంతుగా చాలా పెద్ద మనసు చూపుతున్నానని అనుకున్నాడు.

కానీ యేసు అన్ని హద్దులను చెరిపేస్తూ ఇలా అంటాడు:

“ఏడు సార్లు కాదు; డెబ్బై ఏడు సార్లు.”

అంటే, క్షమించడం లెక్కలు వేసే విషయం కాదు. అది ఖాతాల పుస్తకం కాదు. అది గణకయంత్రం పని కాదు. క్షమించడం ఒక జీవన విధానం.

ఈ బోధ ఎంత కష్టమో యేసుకు తెలుసు. అందుకే ఆయన ఒక ఉపమానం చెబుతాడు.

తీర్చలేని అప్పు

ఈరోజు సువార్తలో ఒక సేవకుని గురించి వింటాము. అతడు తన యజమానికి పది వేల తలాంతులు అప్పు పడ్డాడు. అది ఊహించలేనంత పెద్ద మొత్తం. ఈరోజు లెక్కలో చూస్తే కోట్ల కొద్దీ రూపాయలు. ఎప్పటికీ తీర్చలేని అప్పు.

ఆ సేవకుడు మోకాళ్లపై పడి ఇలా వేడుకుంటాడు:

“నాకు కొంత గడువు ఇవ్వండి. నేను అంతా చెల్లిస్తాను.”

కానీ యేసు మాటలు విన్న ప్రతి ఒక్కరికీ అది అసాధ్యమని తెలుసు. ఎంత సమయం ఇచ్చినా ఆ అప్పు తీర్చడం సాధ్యం కాదు.

అప్పుడు ఈ ఉపమానంలో ఆశ్చర్యపరిచే సంఘటన జరుగుతుంది.

యజమాని అప్పు చెల్లించడానికి గడువు ఇవ్వడు.

అప్పును పూర్తిగా రద్దు చేస్తాడు.

న్యాయాన్ని కరుణ అధిగమిస్తుంది.

దేవుడు మనతో వ్యవహరించేది కూడా ఇలాగే.

మనలో చాలామంది దేవుణ్ణి మన తప్పులన్నింటినీ లెక్కపెట్టే గణకుడిలా ఊహిస్తాం. కానీ యేసు మనకు తెలియజేసే దేవుడు లెక్కలకు అందని కరుణ కలిగిన

తండ్రి. ఆయన మనలను కేవలం సహించడు. మనకు కొత్త ఆరంభాన్ని అనుగ్రహిస్తాడు.

జర్మన్ ప్రసంగంలో దీనిని ఎంతో అందంగా ఇలా చెబుతుంది:

"నిన్ను చెరసాలలో వేయలేదు. నిన్ను శిక్షించలేదు. నిన్ను నిందించలేదు. దానికి బదులుగా నీ అప్పంతా పూర్తిగా రద్దు చేయబడింది."

ఇదే క్రైస్తవ విశ్వాసం యొక్క హృదయం.

యేసు జీవితమంతా ఈ కరుణతో నిండి ఉంది.

వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీ ధర్మశాస్త్రం ప్రకారం శిక్షకు పాత్రురాలు. ఆమెపై రాళ్లు విసరడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. కానీ యేసు ఇలా అంటాడు:

"నేను కూడా నిన్ను శిక్షించను. వెళ్ళు; ఇకపై పాపం చేయకు."

ఆయన ఆమె పాపాన్ని మాత్రమే చూడలేదు; ఆమె జీవితంలోని బాధను కూడా చూశాడు. ఆమె ఆత్మను మాత్రమే కాదు, ఆమె గౌరవాన్ని కూడా పునరుద్ధరించాడు.

పేతురు ఎన్నడూ యేసును ఎరుగనని చెప్పనని గట్టిగా చెప్పుకున్నాడు. కానీ కొన్ని గంటల్లోనే మూడుసార్లు,

"ఆ మనిషి ఎవరో నాకు తెలియదు"

అని ప్రమాణం చేశాడు.

అప్పుడు యేసు అతనివైపు చూశాడు.

ద్వేషంతో కాదు.

ప్రేమతో.

ఆ ఒక్క చూపులోనే పేతురు దేవుని క్షమను లోతుగా అనుభవించాడు. బయటకు వెళ్లి బిగ్గరగా ఏడ్చాడు.

పౌలు కూడా ఒకప్పుడు సంఘాన్ని హింసించినవాడు. కానీ తరువాత ఆశ్చర్యంతో ఇలా చెప్పాడు:

“అర్హతలేనివాడినైన నన్ను ఆయన పిలిచాడు.”

తన జీవితమంతా తాను పొందిన ఆ కరుణనే అందరికీ ప్రకటిస్తూ గడిపాడు.

సహోదర సహోదరీలారా,

మనమందరం కూడా ఆ దేవుని కరుణకు అవసరమైనవారమే.

ఈ రోజుల్లో కొందరు పాపాన్ని చాలా తేలికగా తీసుకుంటున్నారు. అపరాధం అనే దే లేదన్నట్లు ప్రవర్తిస్తున్నారు. కానీ మన హృదయ గర్భంలో మనకు తెలుసు—మనము ఒకరినొకరు బాధపెడతాము, గాయపరుస్తాము; దేవునికీ విశ్వాసంగా ఉండలేకపోతాము.

అయినా ఈరోజు సువార్త మనకు ధైర్యంగా ప్రకటిస్తోంది:

దేవుని కరుణకన్నా గొప్ప పాపం ఏదీ లేదు.

క్షమించడం అంత సులభం కాదు

కానీ ఇప్పుడు మరింత కఠినమైన భాగం వస్తుంది.

దేవుని నుండి క్షమను పొందడం ఒక విషయం. ఇతరులను క్షమించడం మరో విషయం.

క్షమించడం అంత సులభం కాదు.

ఎవరో ఒకరు ఇలా చెప్పారు:

“క్షమించడం చాలా అందమైన ఆలోచన. కానీ నిజంగా క్షమించవలసిన వ్యక్తి ఎదురైనప్పుడే అది ఎంత కష్టమో తెలుస్తుంది.”

ఇది నిజమే.

కొన్ని గాయాలు చాలా లోతుగా ఉంటాయి. కొందరు ద్రోహం, హింస, తిరస్కారం, అవమానం లేదా విరిగిపోయిన నమ్మకాన్ని ఎన్నో సంవత్సరాల పాటు

తమ హృదయంలో మోస్తూ ఉంటారు. కొన్నిసార్లు మనకు అపకారం చేసిన వ్యక్తి క్షమాపణ కూడా చెప్పడు. తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపం కూడా చూపడు.

ఈరోజు మొదటి పఠనమైన సిరాక్ గ్రంథం కోపం, పగ, ప్రతీకారం, ఇతరుల పాపాలను లెక్కపెట్టుకుంటూ ఉండడం గురించి మాట్లాడుతోంది. ఇవన్నీ మానవ సహజమైన భావాలే.

యేసు కూడా కోపాన్ని అనుభవించాడు. అన్యాయం జరిగినప్పుడు ఆయన కోపగించాడు. దేవాలయాన్ని వ్యాపార స్థలంగా మార్చినప్పుడు ఆయన కోపం వ్యక్తం చేశాడు. బలహీనులను అణచివేసినప్పుడు కూడా ఆయన స్పందించాడు.

అయితే, క్షణికమైన కోపానికి, హృదయంలో దాచుకొని పెంచుకునే పగకు చాలా తేడా ఉంది.

మనకు కోపం రావడమే ప్రమాదం కాదు. ఆ కోపాన్ని మనసులో దాచుకొని, దానిని పోషిస్తూ, కాపాడుకుంటూ, చివరకు అది మన వ్యక్తిత్వంలో భాగమైపోవడమే అసలు ప్రమాదం.

అలా జరిగినప్పుడు కోపం విషంగా మారుతుంది.

దీనికి ఈ రోజుల్లో మనందరికీ తెలిసిన ఒక ఉదాహరణ ఉంది—రోడ్డు మీద కోపావేశం.

కొన్నిసార్లు రోడ్డుపై చాలా చిన్న సంఘటన జరిగినా, ఒక్కసారిగా తీవ్రమైన కోపం బయటపడుతుంది. ఒక వాహనం మరొక వాహనం ముందు వెళ్లినా, కొన్ని క్షణాల్లోనే అరుపులు, దూషణలు, కొన్నిసార్లు హింస కూడా మొదలవుతుంది. జరిగిన తప్పుకన్నా ప్రతిస్పందన చాలా ఎక్కువగా ఉంటుంది.

ఎందుకు?

ఎందుకంటే చాలాసార్లు ఆ కోపం రోడ్డుపై ప్రారంభం కాలేదు. రోడ్డుపై జరిగిన సంఘటన మనసులో అప్పటికే మరిగిపోతున్న కోపాన్ని మాత్రమే బయటపెట్టింది.

అందుకే క్షమించలేని మనసు ఎదుటివారిని మాత్రమే నాశనం చేయదు; మనల్ని కూడా నాశనం చేస్తుంది.

హృదయాన్ని హింసించే యాతనకారులు

జర్మన్ ప్రసంగంలో ఈరోజు సువార్తలో చెప్పబడిన "యాతనకారులు" గురించి ఎంతో శక్తివంతంగా వివరించబడింది.

యేసు ఇలా చెబుతున్నాడు: క్షమించని ఆ సేవకుడిని యాతనకారుల చేతికి అప్పగించారు.

ఆ యాతనకారులు ఎవరు?

ఆ ప్రసంగకర్త ఇలా అంటారు:

వారు నిజంగానే ఉన్నారు.

వారు మన హృదయంలో పేరుకుపోయిన చేదు భావాలు.

వారు మన అంతరంగాన్ని విషపూరితం చేసే పగ.

వారు ఆనందాన్ని కోల్పోయే మన స్థితి.

వారు మనమే మన కోసం నిర్మించుకున్న అంతరంగ కారాగారం.

క్షమించడానికి నిరాకరించినప్పుడు ఈ యాతనకారులే మనలను బాధిస్తుంటారు.

దీనికి ఆయన జర్మనీలోని ఒక రైతు కుటుంబం గురించి జరిగిన సంఘటనను చెబుతారు.

పక్కపక్కనే ఉన్న రెండు వ్యవసాయ కుటుంబాలు భూమి విషయంలో ఎన్నో సంవత్సరాల క్రితం జరిగిన ఒక వివాదం కారణంగా తరతరాలుగా ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. అసలు గొడవ ఎలా ప్రారంభమైందో కూడా ఎవరికీ సరిగా గుర్తులేదు. కానీ పగ మాత్రం అలాగే కొనసాగింది.

ఒక రోజు ఆ పొరుగింటిలో పెళ్లి జరిగింది.

పెళ్లికూతురు స్వయంగా వచ్చి మరో కుటుంబాన్ని ఆహ్వానిస్తూ ఇలా చెప్పింది:

“ఈ పాత గొడవను ఇక్కడితో ముగిద్దాం. మనమందరం కలిసి ఈ ఆనందాన్ని పంచుకుందాం.”

కానీ గర్వం దానికి అడ్డుగా నిలిచింది.

అందువల్ల ఒకవైపు సంగీతం, నృత్యం, నవ్వులు, సంతోషంతో పెళ్లి వేడుక కొనసాగుతుండగా, మరో కుటుంబం తమ ఇంట్లోనే కూర్చొని ఆ ఆనంద ధ్వనులను దూరం నుండి మాత్రమే వింటూ ఉండిపోయింది.

ఆ ప్రసంగకర్త ఇలా అంటారు:

“వారి ఆనందమే మా యాతనకారిగా మారింది.”

పగ మనతో చేసేది ఇదే.

అది మనలను బంధిస్తుంది.

ఈ రోజుల్లో కూడా ఎంతోమంది ఇలాగే జీవిస్తున్నారు.

భర్త, భార్య ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోరు; ఎందుకంటే “నన్ను క్షమించు” అని ముందుగా చెప్పడానికి ఎవరికీ ఇష్టం ఉండదు.

పిల్లలు తల్లిదండ్రులను విడిచిపోతారు.

చిన్న అపార్థం వల్ల స్నేహితులు సంవత్సరాల పాటు మాట్లాడుకోరు.

ఎన్నో సంవత్సరాల క్రితం ఒక యాజకుని వల్ల తాము బాధపడ్డామని లేదా నిరాశ చెందినామని చెప్పి కొందరు సంఘాన్ని కూడా విడిచిపెడతారు.

కొన్నిసార్లు యాజకులే తమ సంఘాల పట్ల చేదు భావాలతో జీవిస్తారు.

ఇలాంటి విరిగిపోయిన అనేక సంబంధాల వెనుక ఒకే విషాదం దాగి ఉంది—

క్షమించలేని మనసు.

క్షమించడం కష్టమైన పని కాబట్టి, ఈరోజు మన ధ్యానంలో మరో ముఖ్యమైన విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి.

క్షమించడం చాలా సందర్భాల్లో సమయాన్ని కోరుతుంది.

గాయాలు మానడం సాధారణంగా నెమ్మదిగానే జరుగుతుంది.

సంబంధాలు లోతుగా దెబ్బతిన్నప్పుడు, సయోధ్య ఒక్క రాత్రిలోనే ఏర్పడదు. గాయం ఎంత లోతుగా ఉంటే, స్వస్థతకు అంత ఎక్కువ సమయం అవసరం.

స్వస్థతకు సమయం అవసరం

ఉత్తర ఐర్లాండులో జరిగిన శాంతి ప్రక్రియ దీనికి ఒక మంచి ఉదాహరణ. దశాబ్దాలుగా పేరుకుపోయిన బాధను, అనుమానాన్ని ఒక్కసారిగా తొలగించడం సాధ్యం కాలేదు.

కుటుంబాల్లోనూ, సంఘాల్లోనూ ఇదే నిజం.

కొన్నిసార్లు మనం మరొకరికి ఇవ్వగలిగే అత్యంత గొప్ప బహుమతి సమయం.

ఈరోజు ఉపమానంలో ఇద్దరు సేవకులూ ఒకే మాట అంటారు:

“నాకు కొంత గడువు ఇవ్వండి.”

ఎంతమంది మనతో కూడా నిశ్శబ్దంగా ఇదే మాట చెబుతుంటారో!

“మారడానికి నాకు కొంత సమయం ఇవ్వండి.”

“నా గాయాలు మానడానికి నాకు కొంత సమయం ఇవ్వండి.”

“నేను చేసిన తప్పు ఎంత తీవ్రమైందో గ్రహించడానికి నాకు కొంత సమయం ఇవ్వండి.”

మరికొన్నిసార్లు మనమే కూడా దేవుని ముందు, అలాగే ఒకరి ముందు ఒకరం ఇదే ప్రార్థన చేయవలసి రావచ్చు.

“ప్రభూ, నాకు కొంత సమయం ఇవ్వు.”

ఒక చిన్ననాటి పాఠం

జర్మన్ ప్రసంగకర్త తన చిన్ననాటి జీవితంలోని ఒక సాధారణ సంఘటనను కూడా చెబుతారు.

చిన్నప్పుడు ఆటలు ఆడేటప్పుడు ఓడిపోవడం ఆయనకు అసలు ఇష్టం ఉండేది కాదు. ఒకసారి బల్లమీద ఒక ఆట ఆడుతుండగా, ఓడిపోతున్నానని కోపంతో ఆటలో ఉన్న గుళికలన్నింటినీ బల్ల మీద నుంచి తోసివేసి ఆటనే పాడు చేశాడు.

ఆయన తండ్రి వెంటనే ఆయనను పై అంతస్తులోని తన గదికి పంపించాడు.

ఆయన కోపంతో గదిలో కూర్చుని ఉండగా, కింద అంతస్తులో మిగతావాళ్లు నవ్వుకుంటూ మళ్లీ ఆటను కొనసాగిస్తున్న శబ్దం వినిపించింది.

తర్వాత ఆయన ఇలా చెప్పారు:

“నాకు వాళ్ల మీద కోపం లేదు. నాకు నా మీదనే కోపం వచ్చింది. నేను కిందికి వెళ్లి ‘నన్ను క్షమించండి’ అని ఒక్క మాట చెప్పి ఉంటే చాలు. కానీ ఆ మాట చెప్పడానికి నా గర్వం అడ్డుపడింది.”

మళ్లీ అదే—

యాతనకారులు.

ఈ రోజుల్లో కూడా ఎంతమంది గర్వం అనే కారాగారంలో చిక్కుకొని జీవిస్తున్నారు!

“నన్ను క్షమించు” అనే రెండు మాటలు చెప్పలేక.

అలాగే,

"నేను నిన్ను క్షమిస్తున్నాను" అనే మాట చెప్పగలిగితే ఎన్నో విరిగిపోయిన సంబంధాలు మళ్లీ కొత్త జీవితం పొందగలవు.

దేవుడు మనతో ఎలా వ్యవహరిస్తాడు

ఈరోజు సువార్త హృదయంలో ఒక అద్భుతమైన సత్యం ఉంది.

దేవుడు మనతో కేవలం న్యాయం ప్రకారమే వ్యవహరించడు.

దేవుడు మనలను న్యాయం ప్రకారం మాత్రమే తీర్చిదిద్దితే, మనలో ఎవరు ఆయన సన్నిధిలో నిలబడగలరు?

దానికి బదులుగా, దేవుడు మనతో కరుణతో వ్యవహరిస్తాడు.

పవిత్ర పౌలు ఇలా అంటున్నాడు:

"మనము ఇంకా పాపులమై ఉన్నప్పుడే క్రీస్తు మన కొరకు మరణించాడు."

మనము పరిపూర్ణులమయ్యే వరకు దేవుడు ఎదురు చూడలేదు.

క్రీస్తు మన అప్పును తనపైకి తీసుకున్నాడు.

అందుకే ప్రతి పవిత్ర బలిలో యాజకుడు మన చూపును యేసువైపు తిప్పుతూ ఇలా ప్రకటిస్తాడు:

"ఇదిగో లోక పాపాలను తొలగించు దేవుని గొర్రెపిల్ల."

ఇదే మన విశ్వాసానికి కేంద్రబిందువు.

దేవుడు మనతో ఇలా వ్యవహరిస్తే, మనమూ ఒకరితో ఒకరు అలాగే వ్యవహరించాలని యేసు చెబుతున్నాడు.

అంటే,

"నువ్వు నాతో ఎలా ప్రవర్తించావో, నేనూ నీతో అలాగే ప్రవర్తిస్తాను" అని కాదు.

కాని,

“దేవుడు నన్ను ఎలా క్షమించాడో, నేనూ నిన్ను అలాగే క్షమిస్తాను” అనేదే క్రైస్తవ జీవన విధానం.

ముగింపు

చివరిగా మరో సంఘటనతో ముగిద్దాం.

స్పెయిన్ అంతర్యుద్ధం జరిగిన కాలంలో పాకో అనే ఒక యువకుడు తన తండ్రితో తీవ్రమైన వాగ్వాదం జరిగిన తర్వాత ఇంటి నుంచి వెళ్లిపోయాడు.

నెలలు గడిచిపోయాయి.

తండ్రి అతనిని వెతకడానికి అనేక చోట్ల తిరిగాడు. కానీ ఎక్కడా కనిపించలేదు.

చివరికి నిస్సహాయుడైన ఆ తండ్రి మాడ్రిడ్ నగరంలోని ఒక వార్తాపత్రికలో ఒక చిన్న ప్రకటన ఇచ్చాడు.

అందులో ఇలా వ్రాశాడు:

“పాకో, నిన్ను పూర్తిగా క్షమించాను. రేపు మధ్యాహ్నం పన్నెండు గంటలకు వార్తాపత్రిక కార్యాలయం ముందు నన్ను కలువు. — నీ తండ్రి.”

మరుసటి రోజు అక్కడికి పాకో అనే పేరుగల ఎనిమిది వందల మందికిపైగా యువకులు వచ్చారు.

ఎందుకు?

ఎందుకంటే ప్రతి మానవ హృదయం లోతుల్లో క్షమించబడాలనే ఆకలి ఉంది.

అలాగే ప్రతి మానవ హృదయంలో క్షమించగలగాలనే కోరిక కూడా ఉంది.

ఈరోజు యేసు మనకు గుర్తుచేస్తున్నాడు:

క్షమించడం బలహీనత కాదు.

క్షమించడం స్వేచ్ఛ.

అది పాపిని విముక్తి చేస్తుంది.

గాయపడిన వ్యక్తిని విముక్తి చేస్తుంది.

మన హృదయాన్ని కూడా విముక్తి చేస్తుంది.

అందువల్ల ఈరోజు మనమందరం దేవునిని ఇలా ప్రార్థిద్దాం:

పగ అనే నియమం ప్రకారం కాకుండా, దేవుని కరుణ ప్రకారం జీవించే కృపను మాకు అనుగ్రహించుము.

మన జీవితాలు ఇలా ప్రకటించుగాక—

“నువ్వు నాతో ఎలా చేశావో, నేనూ నీతో అలాగే చేస్తాను” అని కాదు,

కాని,

“దేవుడు నన్ను ఎలా క్షమించాడో, నేనూ నిన్ను అలాగే క్షమిస్తున్నాను.”

**ఆమెన్.**